ప్రతి రైతుకు అండగా ఉంటాం

రాజంపేట రూరల్: మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి అరటి రైతుకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి భరోసా ఇచ్చారు. గాలివాన బీభత్సానికి నేల కొరిగిన అరటి తోటలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డీఓ జీ రామకృష్ణారెడితో కలిసి ఎమ్మెల్యే మేడా బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లి, హస్తవరం చెర్లోపల్లి, లింగరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, వరదయ్యగారిపల్లి పంచాయతీలలో నేల కొరిగిన అరటి తోటలను పరిశీలించారు. అదే విధంగా రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలోకి వెళ్లిన సమయంలో రైతులు తాము ఎంత నష్ట పోయింది తెలియజేసి విలపించారు. అధైర్య పడకండి తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపు 2వేల ఎకరాలలో అరటి నేలకొరిగి రైతులకు రూ.20కోట్ల మేర నష్టం వాటిల్లడం బాధాకరమన్నారు. రైతుల నష్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని తెలిపారు.

రైతులకు అండగా నిలుద్దాం

రాయచోటిటౌన్ : ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు ఎళ్లవేళ్లలా తోడుగా నిలుద్దామని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజక వర్గ పరిధిలోని 10 మండలాలలో పంట నష్టపోయిన వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని చెప్పారు. అలాగే తుపాన్ ప్రభావంతో నియోజక వర్గ పరిధిలో ఏమైనా నష్టాలు వాటిల్లాయా అనే విషయాలను, వివరాలను వివరంగా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని చెప్పారు. నియోజక వర్గ పరిధిలో సంబేపల్లె మినహా అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, కానీ ఇప్పుడు జరిగిన పంట నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ మండలాన్ని కూడా కరువులో చేర్చాలని కోరారు. ఈ తుపాను వల్ల మొత్తం 62 గ్రామాల ద్వారా 1078 మంది రైతులకు రూ.5.4 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.



రాజంపేట రూరల్: పెద్దకారంపల్లిలో దెబ్బతిన్న అరటి గెలలను ఎమ్మెల్యే మల్లికార్జున రెడ్డికి చూపిస్తున్న రైతులు



అధికారులతో మాట్లాడుతున్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కూడళ్ల సుందరీకరణ నిర్మాణాలపై సమీక్ష

రాయచోటి పట్టణంలో టవర్ క్లాక్ నిర్మాణం ముఖ్య రవాణా దారులోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనులు డిజైన్‌లపై ఆర్కిటెక్ట్‌లతో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. రాయచోటి ఏడీఏ శ్రీలత, లక్కిరెడ్డిపల్లె ఏడీఏ జయరాణి, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, డీఈ సుధాకర్ నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలో ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి అన్నారు. బుధవారం గుంజన నది ఉప్పెన తగ్గడంతో పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగనమలలో అధికంగా పొలాలు కోతకు గురయ్యాయని తెలిపారు. ఈటమాపురం వద్ద ఉన్న వంతెనను పరిశీలించారు. దెబ్బతిన్న మామిడి, అరటి పంటలను పరిశీలించారు.

మండలస్థాయి అధికారులతో సమావేశం

బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో తుపానుపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మీమీ శాఖలలో రైతులకు నష్టం వాటిల్లి ఉంటే వెంటనే వాలంటీర్లు ద్వారా సమాచారం తెలుసుకొని పూర్తి వివరాలు అందజేయాలన్నారు. తహశీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

రాజంపేట టౌన్ : ఇటీవల కర్నూలులో జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ మేయర్ కప్ పోటీల్లో స్థానిక ఇంటిగ్రెటెడ్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు పతకాలను సాధించారు. ఈ విషయాన్ని ఆ హాస్టల్ అధికారిణి శోభారాణి బుధవారం విలేకరులకు తెలిపారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టీ.సుష్మ అండర్-14 40-45 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే ఎనిమిదవ తరగతి విద్యార్థిని కీర్తి అండర్-13 30-35 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. తొమ్మిదవ తరగతి విద్యార్థినిలు ఎం.జోత్స్నప్రియ, వై.అమృత 40-45 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. టెన్త్ విద్యార్థిని సీ.సంధ్య 40-45 కేజీల విభాగంలో బ్రాంజ్‌మెడల్, ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఏ.లాలిత్య 35-40 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని కే.ఇందు 55-60 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆమె వెల్లడించారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి

ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలో ఈనెల 15వ తేది నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పాఠశాల పీఈటీలు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, ఈఓపీఆర్‌డీ సతీష్ కుమార్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, నాయకులు విశ్వనాథ్, షావల్లి పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ

సంబేపల్లె : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దేశానికే ఆదర్శమని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీతో కలిసి అధికారులకు క్రీడాసామగ్రిని అందజేశారు. యువత శారీరకంగా, ధృడంగా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈనెల 15 నుంచి 2024, ఫిబ్రవరి 3వ తేది వరకు టోర్నమెంట్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయాలకు ఇప్పటికే కిట్లను అందజేశామన్నారు. రమేష్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వి.వెంకటరమణారెడ్డి, వ్యవసాయ సలహామండల చైర్మన్ వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి,వసంత శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ నాయక్, ఎంపీడీఓ నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.



సంబేపల్లె: క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి

నందలూరు(రాజంపేట): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఎర్రచెరువు కట్టపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయం నుంచి నందలూరు రైల్వే కేంద్రంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వరకు శ్రీ వినాయకస్వామి, సుబ్రమణ్యం స్వామి సహిత శ్రీ ధర్మశాస్త శ్రీ అయ్యప్పస్వామి వారి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో కేరళ రాష్ట్రం సాంప్రదాయ వాయిద్యం, కాంతారా నృత్యం భక్తులను అలరింప చేశాయి. భక్తి శ్రద్ధలతో దీపాలను చేతపట్టుకొని గ్రామోత్సవంలో మహిళలు పాల్గొన్నారు. గ్రామోత్సవం అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తాదులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

లక్కిరెడ్డిపల్లి: గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక లక్కిరెడ్డిపల్లి టౌన్ సచివాలయంలో జగనన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ దస్తగిరి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

గాలివీడు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేసుకుందామని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, వైస్ ఎంపీపీ2 గాలి శ్రీనివాసులు, సర్పంచ్ ఉమాపతిరెడ్డి అన్నారు. సందర్భంగా బుధవారం మండలంలో సీసీ పల్లె గ్రామ సచివాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ బోర్డును ప్రారంభించారు. సర్పంచ్ క్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామేశ్వర్‌రెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ప్రజలకు ఇంకా ఉందని జెట్పీటీసీ రత్నమ్మ బుధవారం తెలిపారు. రెడ్డివారిపల్లె సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుధాకర్‌రాజు, తుమ్మల సురేష్, కొరముట్ల శేఖర్, ఈవోపీఆర్డీ నాగార్జున పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



రాజంపేట టౌన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, కడప మేయర్ సురేష్‌బాబు, పోలా



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా



రాయచోటి: అంబేద్కర్ విగ్రహానికి నివాళి

రాజంపేట టౌన్ : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని ఆర్ అండ్‌బీ సర్కిల్ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు దాసరి పెంచలయ్య, కౌన్సిలర్లు న్యామతుల్లా, సనిశెట్టి నవీన్‌కుమార్, పసుపులేటి సుధాకర్, తంబా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అంబేద్కర్ చిరస్మరణీయుడు

రాజంపేట రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. స్థానిక మేడా భవన్‌లో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. వైస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జీవీ కృష్ణారావు, పట్టణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు వడ్డే రమణ, వెలగచెర్ల గంగిరెడ్డి, నాయకులు పోలి మురళీరెడ్డి, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, ఎస్ సుబ్బయ్య పాల్గొన్నారు.

వీరబల్లిలో ..

వీరబల్లి(రాజంపేట): వీరబల్లిలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సొరువు స్వప్న, వీఆర్‌డీఎస్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

సిద్దవటం : మండలం కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరికొండయ్య మాట్లాడారు.

నందలూరు(రాజంపేట): భారత రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మళ్లీ పుట్టాలని ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని నందలూరు బస్టాండ్ కూడలిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యానారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీవిజన్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు పెనుబాల నాగ సుబ్బయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, మోడపోతుల రాము, ఆర్ముగం విశ్వనాథ్, కాకి చంద్ర, నాగభూషణం పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జాతీయరహదారిలోని మాండవ్యనది బ్రిడ్జివద్దగల అంబేద్కర్ విగ్రహానికి ఆయన మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సిపి నేతలతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మార్కెట్‌కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, బీసీనేత పల్లపు రమేష్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి అంబేద్కర్: ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

భారతజాతిని జాగృతపరచిన ఆదర్శమూర్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకున్న సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నారన్నారు.

రైల్వేకోడూరు : అంబేద్కర్ ఆశయాలను వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి , ఉప సర్పంచ్ తోట శివసాయిలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. ఎస్సీ మానిటరింగ్ సభ్యులు తుమ్మల సురేష్, జెట్పీటీసీ రత్నమ్మ , ముజీబ్, సిహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్, బండారు మల్లి పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేట సచివాలయంలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఏపీ ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పెంచలయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని చిన్నఓరంపాడు అడ్డరోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి బుధవారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, వైఎస్సార్ సిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న జాతీయ లోక్ అదాలత్

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 9వ తేదిన రైల్వేకోడూరు జూనియర్ సివిల్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సివిల్‌కోర్టు జడ్జి అంజనీ ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వివిధ కారణాలతో చిన్నచిన్న తగాదాలు పడి ఒకరిపై ఒకరిపై కేసు పెట్టుకున్న కోడూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన కక్షిదార్లు రాజీ కాదగిన సివిల్ క్రిమినల్ కేసులను పరిష్కారం చేసుకోవచ్చన్నారు. రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు.

అతిథి భోజనం

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం మాజీ జెడ్పీటీసీ సిద్దా రాజశేఖర్ రెడ్డి, సిద్దా వెంకటసుబ్బమ్మ మనువరాలు సిద్దా కార్తీకేయ పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు అతిథి భోజనం అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వరద బాధితులకు సాయం

ఓబులవారిపల్లె : మిచాంగ్ తుపాన్ కారణంగా మూడు రోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం రైల్వేకోడూరులోని రాఘవరాజుపురం దళితవాడ గ్రామంలోని గ్రామస్తులకు మంగంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొలూరు సుబ్రమణ్యం రెడ్డి, సతీష్ రెడ్డి కూరగాయలు, ఆర్థిక సాయాన్ని అందించారు. తుఫాన్ కారణంగా కూలి పనులకు వెళ్లకుండా ఇబ్బంది పడుతున్న ప్రజలకు తమవంతు సహకారం అందించామని కొలూరు సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు.

గోరాన్‌చెరువులో పల్లె నిద్ర

గాలివీడు: గ్రామాలలో చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకోకుండా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగాధర్‌రావు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గోరాన్‌చెరువు గ్రామం బీసీ కాలనీలో స్థానిక గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనవసరంగా చిన్న పాటి ఘర్షణలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. ఎస్ఐ వెంకటశివకుమార్, ఏఎస్ఐ ఆంజిరెడ్డి, హోంగార్డు సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

సంబేపల్లె : ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులగణన చేపట్టిందని, సచివాలయ సిబ్బంది గ్రామ వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ తెలిపారు. బుధవారం మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 9వ తేది నుంచి 18వ తేది వరకు గ్రామంలోని ప్రతి ఇంటికీ వలంటీర్‌లతో సహా అధికారులు వెళ్లి సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. రమేష్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వి వెంకటరమణా రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సావిత్రమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి, వసంత శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ నాయక్, ఎంపీడీఓ నరసింహులు కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మండలంలో రైతులకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పుల్లారెడ్డితో సాయికిషోర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ఆన్‌లైన్ తప్పనిసరి అని, ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అదే విధంగా మండలంలో మిచాంగ్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న పండ్లతోటలను రెవెన్యూ అధికారులు పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి పంపాలని కోరారు. వైఎస్సార్ సిపి నాయకులు ఎస్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కులగణనపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

పెనగలూరు (ఓబులవారిపల్లె): పెనగలూరు ఎంపీడీఓ సభా భవనంలో గురువారం కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుందని ఎంపీడీఓ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక స్థితికి సంబంధించి కుల ఆధారిత డేటాపై కార్యాచరణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, వీఆర్‌ఓలు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పరికరాల పంపిణీ

రామాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పరిశుభ్రత కోసం శుభ్రత చేసే పరికరాలను బుధవారం మండల ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రా పంపిణీ చేశారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు పడుతున్న సందర్భంగా పాఠశాలలో గదులను శుభ్రం చేసేందుకు పాఠశాల ఆవరణలో , మరుగుదొడ్ల శుభ్రత కోసం బ్లీచింగ్ పౌడర్ యాసిడ్ వంటివి ఆయా పాఠశాలలకు అందించామని తెలిపారు. కస్తూర్బా బాలికల పాఠశాల ఆదర్శ పాఠశాల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆయా పాఠశాలల సిబ్బందికి అందజేశారు.